# నమస్తే తెలంగాణ
# మెదక్

I హైదరాబాద్, సోమవారం 17 జూన్ 2024 MEDAK




గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## కుట్రలకు పాల్పడుతున్న కాంగ్రెస్

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 16: అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని, కేసీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడం చేతకాక కేసీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. రైతాంగానికి సాగునీరందించాలనే ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి మండుటెండల్లో సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 70ఏండ్ల పాలనలో విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయి రైతులు నిత్యం ఆత్మహత్యలకు పాల్పడేవారని, అలాంటి తెలంగాణను వెలుగు జిలుగుల తెలంగాణగా మార్చింది కేసీఆర్ అన్నారు. విద్యుత్ కమిషన్ విచారణ పేరుతో కేసీఆర్‌పై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని, కక్షపూరితంగా ఏర్పాటు చేసిన నర్సింహారెడ్డి కమిషన్‌ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కారు ఆరు నెలల్లోనే రూ.40వేల కోట్ల అప్పు చేసిందని, ఆ డబ్బులు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ సర్కారు ఆరు మాసాలు గడిపిందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 90శాతం పనులు పూర్తి చేసిందని, అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీలు మల్లేశం, బాలమల్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు



సిద్దిపేట, జూన్ 16: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని, అల్లా దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం ఈ పండుగ ఇచ్చే మంచి సందేశాలు అన్నారు. దైవప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగ సోదరాభావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడు ఉండాలని ఆకాక్షించారు.



సిద్దిపేట నుంచి అనంతసాగర్ వరకు రాజీవ్ రహదారిపై హరితహారం చెట్లను నరికివేయడంతో కనిపిస్తున్న మొండెంలు



సంగారెడ్డి పట్టణంలో హరితహారం చెట్లను నరికివేసిన దృశ్యం

# పచ్చని చెట్లపై గొడ్డలివేటు!

## ఇష్టారాజ్యంగా హరితహారం చెట్ల నరికివేత

- ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక చోట్ల దారుణం
- విద్యుత్ తీగలకు తాకుతున్నాయన్న సాకుతో చెట్లను నరికివేయిస్తున్న అధికారులు
- రాజీవ్ రహదారి వెంట వృక్ష విలాపం
- గ్రామాలు, మున్సిపాలిటీల్లోనూ నరికివేత

సిద్దిపేట, జూన్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'వానలు వాపసు రావాలి.. కోతులు అడవులకు వెళ్లాలి. మొక్కలు నాటుదాం.. అడవులను కాపాడుదాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం.. హరిత తెలంగాణను నిర్మిద్దాం'.. అనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంట్లో భాగంగా కోట్లాది మొక్కలు నాటి సంరక్షించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ 8 విడతల్లో జరిగిన హరితహారం కార్యక్రమంలో సుమారు 15 కోట్ల వరకు మొక్కలు నాటి సంరక్షించింది. దీంతో సత్ఫలితాలు కనిపించాయి. రహదారుల వెంట, ఖాళీ స్థలాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, పల్లెలు, పట్టణాల్లో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించాయి. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని అమలు చేయగా.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పచ్చనిచెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి.

### ఎక్కడికక్కడ నరికివేత...

బీఆర్‌ఎస్ ప్రభుత్వం పసిపాపలా కాపాడిన హరితహారం చెట్లను ఇవాళ కాంగ్రెస్ హయాంలో ఎక్కడికక్కడ నరికివేస్తున్నారు. కండ్ల ముందు చెట్లు మొండెంలా మారుతున్నాయి. దీంతో ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా హరితహారం చెట్లను నరికివేస్తున్నా అధికార యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కావాలనే చెట్లను నరికి వేయిస్తున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లకు తగులుతున్నాయి అనే సాకుతో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఇటీవల అనేక చోట్ల విద్యుత్‌శాఖ సిబ్బంది ఇష్టారీతిగా చెట్లను నరికివేశారు. ఏపుగా పెరిగిన చెట్లు నీడనిస్తున్నాయి. ఫలాలను అందిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా పచ్చని తోరణాలు కట్టినట్లుగా స్వాగతం పలుకుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్నాయి. ప్రస్తుతం కక్ష కట్టినట్లుగా చెట్లను నరికివేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం కింద మొక్కలు నాటుడు దేవుడెరుగు కానీ... ఉన్న చెట్లను నరికి వేయకుండా కాపాడితే అది పదివేలు అంటున్నారు ప్రకృతి ప్రేమికులు. సిద్దిపేట జిల్లాలోని రాజీవ్ రహదారికి ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలను ఎక్కడికక్కడ నరికివేస్తున్నారు. ఇటీవల సిద్దిపేట పట్టణంలో విద్యుత్ సిబ్బంది హరితహారం చెట్లను నరికివేయగా స్థానిక మున్సిపల్ అధికారులు నోటీసులు పంపారు. రూ.24 లక్షలు జరిమానా కట్టాలని నోటీసులో పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో, కంది, మెదక్ జిల్లాలోని నర్సాపూర్ నియోజకవర్గంలో పలుచోట్ల ఇష్టారీతిన చెట్లను ఇటీవల నరికివేశారు. బీఆర్‌ఎస్ హయాంలో హరితహారం చెట్ల జోలికి వస్తే జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకపోవడంతో పచ్చనిచెట్లు రంపపు కోతకు గురవుతున్నాయి.

### పట్టించుకునేవారు లేరు..

తెలంగాణ హరితహారం కింద నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసినట్లు కనిపిస్తున్నది. కండ్ల ముందు హరితహారంలో చెట్లు కాలిపోతున్నా, నరికివేతకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పసిపిల్లల్లా సాకిన మొక్కలు నేడు మొండెంతో కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నది. గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణను పట్టించుకోవడం లేదు. గతేడాది హరితహారం ఎనిమిదో విడతలో ఉపాధిహామీ పథకంలో లక్షల మొక్కలను నాటారు.తెలంగాణ హరితహారంలో భాగంగా ఇరిగేషన్ ల్యాండ్, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇన్‌స్టిట్యూట్ ప్లాంటేషన్,అవెన్యూ ప్లాంటేషన్ కింద ఈత మొక్కలు, నీలగిరి తదితర మొక్కలను నాటి ప్రతి మొక్కనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతికించింది. ఇప్పుడేమో చెట్లను ఎక్కడికక్కడ నరికివేస్తున్నారు. మరికొన్ని చోట్ల నీళ్లులేక ఎండిపోతున్నాయి. చాలాచోట్ల మంట పెట్టడంతో చెట్లు కాలిపోయి కనిపిస్తున్నాయి. ఇటీవల సిద్దిపేట జిల్లా ములుగు వద్ద రాజీవ్ రహదారిపై వందలాది హరితహారం మొక్కలు కాలిబూడిదయ్యాయి. దీంతో పర్యావరణ పరిరక్షణకు తూట్లు పడుతున్నాయి.



సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద రాజీవ్ రహదారి వెంట హరితహారంలో నాటిన చెట్లను నరికివేసిన దృశ్యం

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు



మెదక్‌లో మాట్లాడుతున్న మల్టీజోన్ ఐజీ రంగనాథ్

- మల్టీజోన్ ఐజీ రంగనాథ్
- మెదక్ ఘటనలో 9 మందిపై కేసు నమోదు

మెదక్ అర్బన్, జూన్ 16 : మెదక్ పట్టణంలో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు కారణమైన 45 మందిని గుర్తించినట్లు మల్టీజోన్ ఐజీ రంగనాథ్ తెలిపారు. ఆదివారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎవరూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించవద్దన్నారు. సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. శనివారం జరిగిన ఇరువర్గాల ఘర్షణలో 45 మందిని గుర్తించినట్లు తెలిపారు. అందులో 9 మందిని అరెస్ట్ చేసి, 3 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మరికొంత మందిని రిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పశువులు తరలిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని సూచించారు. ఎవరూ కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

### భారీ బందోబస్తు..

మెదక్ పట్టణంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ పోలీస్ పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఐజీ రంగనాథ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### మెదక్ పట్టణంలో కొనసాగుతున్న బంద్..

మెదక్ పట్టణంలో ఇరువర్గాల ఘర్షణ జరగడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం మెదక్ పట్టణంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. స్వచ్ఛందంగా వర్తక వ్యాపారులు బంద్ పాటించారు.

## మార్కెట్ నిర్మాణం పూర్తయ్యేనా?

- జనం ఇబ్బందులు పాలకులకు పట్టవా...
- ఇరుకు రోడ్లపై సంతతో ఏండ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- హుస్నాబాద్‌లో నత్తనడకన కూరగాయల, మాంసాహార మార్కెట్ పనులు
- మార్కెట్ కోసం రూ.2.75 కోట్లు కేటాయించిన బీఆర్‌ఎస్ సర్కారు
- అంతంత మాత్రంగానే పనులు
- పట్టించుకునే వారే కరువయ్యారంటున్న ప్రజలు



హుస్నాబాద్‌లో అసంపూర్తిగా ఉన్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం



> ఇరుకు రోడ్లపైనే సంత... ఒకవైపు వాహనాల రాకపోకలు.. మరోవైపు ఇరుకుగా ఉన్న దారిపైనే కూరగాయల విక్రయాలు... దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలిగించేందుకు మార్కెట్ నిర్మించేందుకు నిధులు కేటాయించినప్పటికీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీంతో దుమ్ము, ధూళిలోనే కూరగాయలు, మాంసపు విక్రయాలు రోడ్లపైనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

హుస్నాబాద్ టౌన్, జూన్ 16: పట్టణంలోని అక్కన్నపేట రోడ్ నుంచి రామవరం వెళ్లే రహదారులపై మార్కెట్ కొనసాగుతున్నది. మార్కెట్‌కు సొంత స్థలం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలిగిచేందుకు కేసీఆర్ ప్రభు త్వం పాత తహసీల్ కార్యాలయంలో ఎకరా స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో కూరగాయలతో పాటు మాంసాహార విక్రయాలను వ్యాపారులు నిర్వహించుకునేందుకు భవన నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. కానీ పనులు ఏండ్లకొలది జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు రూ.2.75 కోట్లు**

హుస్నాబాద్ పట్టణంలోని దాదాపు 30వేల జనాభాకు సరిపడా కూరగాయలు, మాంసాహార మార్కెట్ లేకపోవడంతో శాశ్వత పరిష్కారం కోసం రామవరం రోడ్‌లో ఉన్న తహసీల్ కార్యాలయంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను రూ.2.75కోట్లతో నిర్మించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనానికి 2022లో అప్పటి ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఇందులో కూరగాయలు, చికెన్, మటన్, చేపలను విక్రయించేందుకు 48 ప్లాట్‌ఫ్లాంలను నిర్మించే విధంగా డిజైన్ చేసి రూపొందించారు.

**అసంపూర్తిగా సాగుతున్న పనులు...**

2022లో శంకుస్థాపన చేసిన కూరగాయలు, మాంసాహార మార్కెట్ పనులు నత్తనడక సాగుతున్నాయి. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మార్కెట్ కోసం స్థలం కేటాయించి నిధులు కేటాయించినప్పటికీ నిర్మాణ పనులు అసంపూర్తిగా మారడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టెండర్ నిర్వహించి సదరు పనులను ఆర్‌ఎన్ కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించారు. ఈ పనులను పొందిన సదరు సంస్థ వేగవంతంగా పనులు చేపట్టాల్సి ఉన్నా అంతంత మాత్రంగానే నిర్వహిస్తున్నది. గతేడాదే పనులకు సంబంధించిన అగ్రిమెంట్ పూర్తయినప్పటికీ తిరిగి మరోమారు పనుల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో ఇప్పటివరకు కేవలం నాన్‌వెజ్‌కు సంబంధించిన పనులు మాత్రమే సాగుతుండంతో అసలు ఈ భవనం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పనులపై ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### తొందరగా మార్కెట్ కట్టాలే..

రోడ్లమీద అమ్ముకోవాలంటే మస్తు ఇబ్బందిగా ఉంది. కూసోరాదు.. అమ్ముకోరాదు. ఈడ మార్కెట్ సురువు సేసింన్రు. కానీ పని సరిగా చేత్త లేరు. తొందర మార్కెట్ కడితే అందరికీ మంచిగ ఉంటది. సార్లు జెప్పన పనులు సెయిచ్చి బాధలు పోగొట్టాలే.

*– బోయిని వెంకవ్వ, చేపల విక్రయదారు, హుస్నాబాద్*

### మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు



వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు పూర్తిచేసే గడువు గతేడాది ముగిసింది. ఇప్పటివరకు వెజ్ మార్కెట్ పెట్టుకునేందుకు పనులు జరగలేదు. కేవలం నాన్‌వెజ్ పనులు మాత్రమే దగ్గరపడ్డాయి. మళ్లీ పనులు చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. బిల్లులు రాలేదనే కారణంతో పనులు ఆలస్యంగా చేస్తున్నారు.

*– సాయిప్రణీత్, ఏఈ, హుస్నాబాద్ మున్సిపాలిటీ*

## ప్రాణంతీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

### మోసపోయి యువకుడి ఆత్మహత్య



భానుప్రసాద్(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్‌తో మోసపోయిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, రామాయంపేట పోలీసుల వివరాల ప్రకారం... రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దొమ్మాట భానుప్రసాద్(24) కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతూ రూ.1.50 లక్షలను ఆటలో పోగొట్టుకున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఐదురోజుల క్రితం తన వ్యవసాయ బావివద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. బావివద్దకు వెళ్లిన కొడుకు ఇంకా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అక్కడికి వెళ్లిచూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబీకులు రామాయంపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తల్లి దండ్రులు దొమ్మాట బాల్‌నర్సింహులు, బాలలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించారు. రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**యువతకు చైతన్యం చేస్తాం: సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై రంజిత్**

రామాయంపేట పోలీస్ సర్కిల్ వ్యాప్తంగా యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు, సైబర్ నేరాలకు గురికాకుండా కొంతకాలంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై రంజిత్ తెలిపారు. ప్రగతి ధర్మారంలో యువకుడు భానుప్రసాద్ ఆన్‌లైన్ బెట్టింగ్ బారినపడి ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. యువత ఇలాంటి బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు.

## చేర్యాలలో శివాజీ విగ్రహం ఆవిష్కరణ

- హిందువులతో కలిసి స్వీట్లు పంచుకున్న ముస్లింలు



చేర్యాలలో శివాజీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న హిందువులు, ముస్లింలు

చేర్యాల, జూన్ 16: సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని వీరభద్ర సినిమా టాకీస్ ప్రాంతంలోని పాత పెట్రోల్‌బంక్ ఎదురుగా రాత్రికి రాత్రే శివాజీ విగ్రహం ఏర్పాటు చేశారు. చేర్యాల పట్టణంలోని జాతీయ రహదారి రోడ్డు డివైడర్ల మధ్య శనివారం రాత్రి వరకు ఎలాంటి విగ్రహాలు లేవు. తీరా ఆదివారం శివాజీ విగ్రహం దర్శనమివ్వడంతో స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. విగ్రహ ఏర్పాటుకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేశారోనని పలువురు చర్చించుకున్నారు. కాగా, ఆదివారం పలువురు ముస్లిములు శివాజీ విగ్రహం వద్దకు వచ్చి హిందువులతో కలిసి తమ సోదరాభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హిందువులు, ముస్లిములు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసిన ప్రదేశంలోని రోడ్డును ఛత్రపతి శివాజీ రోడ్డుగా నామకరణం చేయాలని నిర్ణయించారు.

## కార్మికుడి బలవన్మరణం

- మృతదేహంతో పరిశ్రమ ఎదుట కుటుంబీకులు, గ్రామస్తుల ఆందోళన



మహేశ్(ఫైల్)



మృతదేహంతో పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టిన బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు

హత్నూర, జూన్ 16 : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామశివారులోని ఎన్ఎసీఎల్ బెల్‌టెక్ పరిశ్రమ వద్ద శనివారం రాత్రి కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబీకులు, స్థానికుల కథనం ప్రకా రం... సాదుల్లానగర్‌కు చెందిన చెక్కల మహేశ్(30) కొంతకాలంగా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మహేశ్ రోజు మాదిరిగానే శనివారం రాత్రి పనికోసం పరిశ్రమ వద్దకు వెళ్లా డు. మద్యంతాగి వచ్చాడని బెదిరించడంతో పాటు బైక్‌తాళాలు లాక్కుని తోటి కార్మికుల ఎదుట అతడిని అవమానపరిచారు. ఈ అవమాన భారం భరించలేక తీవ్ర మనస్తాపంతో పరిశ్రమ ఎదుట గల విద్యుత్ స్తంభం ఎక్కి కరెంట్ తీగలను పట్టుకోవడంతో షాక్‌కు గురై మహేశ్ కిందపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఆందోళన చేశారు. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిన్నారం సీఐ సుధీర్‌బాబు, హత్నూర, గుమ్మడిదల ఎస్సైలు సుభాష్, మహేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు, గ్రామస్తులు పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరిపి బాధిత కుటుంబానికి రూ. 11లక్షల ఆర్థికసాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి తల్లిదండ్రులు సామయ్య, మంగమ్మ, భార్య ప్రమీల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.